క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో గీతం ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వార్డు పరిధి సంజయ్‌గాంధీ కాలనీలో కొండవాలు ప్రజలు కోసం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో సంజయ్‌గాంధీకాలనీ, సింహగిరికాలనీ, హనుమంతవాక తదితర కొండవాలు ప్రాంతాలవారికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవింద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



కృష్ణా డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ఎంపీ భరత్

మద్దిలపాలెం: విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.భరత్ ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవంలో డాక్టర్ వీఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీతో కలిసి ప్రతి విద్యార్థి మొక్కలు నాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ యస్ హరనాథ్ , పోల ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి , శ్యామ్యూల్ డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

చిట్టి చేతులతో వినాయకుడి ప్రతిమల తయారీ



వినాయకుడి మట్టి ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు వినాయకుడి మట్టి ప్రతిమలను తయారు చేశారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని స్కూల్ ఆవరణలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణపై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్కూల్ యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీంతో ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని మట్టి వినాయకుల ప్రతిమలను పెద్ద ఎత్తున తయారు చేశారు.

కుల గణనపై కేంద్రం స్పందించాలి

ఎంవీపీకాలనీ: సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కులగణనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ఆలిండియా ఓబీసీ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. బీసీ కులగణన చేపట్టాలని కోరుతూ తాను గతం సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు ప్రసాద్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కుల గణనపై కేంద్రప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ధర్మాసనం సూచించిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి కులగణనపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

సీనియర్ ఉద్యోగులను మార్గదర్శకంగా తీసుకోవాలి

తగరపువలస: సీనియర్ ఉద్యోగులలో మంచిని మార్గదర్శకంగా తీసుకుని జూనియర్ ఉద్యోగులు పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం ఆనందపురం పీహెచ్‌సీలో ఉద్యోగ విరమణ చేసిన పర్యవేక్షక అధికారి పొట్టి సాంబమూర్తి సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, వైద్యులు సమత, అప్పారావు, ఎం.గంగునాయుడు, షహనాజ్ సాధియా, స్వప్న, శోభారాణి, కల్యాణి పాల్గొన్నారు.

రక్షకులకు భద్రత కరువు

- శిథిలావస్థలో మూడో పట్టణ పోలీసు స్టేషన్
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి
- పెచ్చులూడుతున్న భవనం
- భయాందోళన మధ్య విధులు



పెచ్చులూడిన భవనం



కూలేందుకు సిద్ధంగా ఉన్న త్రీటౌన్ పోలీసు స్టేషన్ భవనం



అధ్వానంగా మెట్ల మార్గం

బీచ్‌రోడ్డు: ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులకు భద్రత కరువైంది. మూడో పట్టణ పోలీసు స్టేషన్ ఎప్పుడు కూలిపోతోందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. చివరికి ఫిర్యాదు చేసేందుకు వస్తున్న ప్రజలు కూడా భయపడుతున్నారు. వర్షం పడితే సిబ్బందిలో గుబులు రేగుతుంది.

గోడలకు భారీ పగుళ్లు

మూడో పట్టణ పోలీసు స్టేషన్‌తో పాటు అదే భవనంలో నార్త్ ఏసీపీ కార్యాలయం..ఎంవీపీ క్రైమ్, ట్రాఫిక్ కార్యాలయాలు కూడా ఉన్నాయి. ఒకో అంతస్తుపై ఉన్న కార్యాలయాలకు వెళ్లే మెట్ల మార్గం పూర్తిగా పగుళ్లు ఏర్పడ్డాయి. భవనం మొత్తం శిథిలావస్థకు చేరుకుంది.

భయం భయంగా..

వర్షా కాలం కావడంతో భవనం నానిపోయి పెచ్చులూడుతున్నాయి. దీంతో సిబ్బంది భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదు చేసేందుకు వస్తున్న ప్రజల పరిస్థితీ ఇంతే.

పొంచి ఉన్న ప్రమాదం

శిథిలావస్థలో ఉన్న మూడో పట్టణ పోలీసు స్టేషన్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు భవనం నానిపోయింది. మరో రెండు రోజుల్లో తుపాను హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులున్నాయి. తక్షణం భవనానికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

పోషకాహారంపై గర్భిణులకు అవగాహన



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శ్రీలత

ఎంవీపీకాలనీ: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత అవగాహన కల్పించారు. పెదజాలరిపేటలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతో గుడ్లు, పాలు, చోడిపిండి, చెక్కిలు, ప్రోటీన్స్, మినరల్స్‌తో కూడిన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు. ఆయా ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వినీష సుందరి, వాసవి మహిళ మండలి ప్రతినిధి షర్మిల, అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

పార్వతీపురం ఎమ్మెల్యే తీరుపై నిరసన

తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



మద్దిలపాలెం డిపో-1 వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యేకు చెందిన ఆరు బస్సులకు ఆర్టీసీ అద్దెకు తీసుకుంది. ఈ బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా విధుల నుంచి తొలగించడాన్ని హైర్ బస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేజేఏ అప్పారావు, రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీపీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరాంలు తీవ్రంగా ఖండించారు. అద్దెబస్ యజమాని టీడీపీ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చర్యలను ఖండిస్తూ మంగళవారం విశాఖవన్ డిపో గేటు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలగించిన ఐదుగురు డ్రైవర్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అర్జున్, రవి, శంకర్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

ఎంవీపీకాలనీ: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ ఎస్ఐ నారాయణరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు తప్పకుండా లైసెన్స్ ఉండాలన్నారు. బైపాస్, హైవే రోడ్లలో ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రతలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

- గోపాలపట్నం హైస్కూల్‌లో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం
- విద్యార్థుల నృత్య, నాటిక ప్రదర్శనలు



రామాయణ విశేషాలను తెలిపే బోధన సామగ్రి ప్రదర్శన



అష్టావధాన ప్రక్రియపై విద్యార్థుల ప్రదర్శన

గోపాలపట్నం: దేశ భాషలందు తెలుగు భాష లెస్స అని శ్రీకృష్ణ దేవరాయులే కీర్తించారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ తెలుగు పండిత పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యార్థులు నృత్య, నాటికలు ప్రదర్శనలు చూపరులను కట్టి పడేశాయి. తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ వీరు చేసిన ప్రదర్శనలు, అవధానాలు, తెలుగుభాష కోసం ప్రముఖులు చేసిన కృషిని వర్ణిస్తూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. తెలుగు ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధన పరికరాల ప్రదర్శన ఆలోచింపజేసింది. అనంతరం సభా ప్రాంగణంలోని తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠ్య పుస్తకాలతో పాటు ఎంతో మంది మహా రచయితలు రాసిన సాహిత్యాన్ని చదవడం అలవర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ తెలుగు భాష పై మక్కువతో చదవాలని విద్యార్థులను కోరారు. గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగుభాషాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ తెలుగుభాషపై అంతా మక్కువ పెంచుకుని చదవడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ తెలుగుభాష తేనె కంటే మధురమైనదన్నారు. మీగడ రామలింగ స్వామి మాట్లాడుతూ తెలుగు భాషలో పద్యం, వచనం, గీతం వంటి ఎన్నో ప్రక్రియలు ఉన్నాయని.. ఇన్ని ప్రక్రియలు ఏ భాషలో లేవని తెలిపారు. అందుకే తెలుగు భాష విశ్వభాషకంటే గొప్పదని అభివర్ణించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, పద్యపఠనం, నృత్యం, నాటికల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమలలోమాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, మాణిక్యాల నాయుడు, శ్రీనివాస్, గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల రావు పాల్గొన్నారు.

నీటి వనరుల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం

మద్దిలపాలెం: కృష్ణా జిల్లాలో వరదలకు బుడమేరు వాగే కారణమని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు పేర్కొన్నారు. ప్రకృతి విధ్వంసం, పర్యావరణ సమతుల్యం కాపాడటంపై పాలకులు దృష్టి పెట్టకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందన్నారు. నీటి వనరుల నిర్వహణలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్నారన్నారు.

అధ్వానంగా సీబీఎం కాంపౌండ్ రహదారి



బురదమయంగా వున్న సీబీఎం కాంపౌండ్ రోడ్డు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు పరిధి సీబీఎం కాంపౌండ్ కాలనీలో వర్షాలు పడితే చాలు పలు రహదారులు బురదమయంగా తయారవుతున్నాయి. నగరంలోనే ప్రముఖ పోష్ కాలినీలో ఒకటైన సీబీఎం కాంపౌండ్‌లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. టింపనీ స్కూలు నుంచి ఆశీలమెట్ట వైపు వెళ్లే రోడ్డు వర్షపునీరు, బురద, రాళ్లతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. వరుసుగా కురిసిన వర్షాలకు మరింత ఛిద్రంగా మారింది. ఇప్పటికైనా జోన్-3 ఇంజినీర్లు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

డెంగ్యూ జ్వరబాధితుడ్ని పరామర్శించిన డీఎంహెచ్‌వో



చైతన్యనగర్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: ఇంటి పరిసరాల పరిశుభ్రతోపాటు, నీటి నిల్వలను ఎప్పటిప్పుడు తొలగించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్. జగదీశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 23వ వార్డులో చైతన్యనగర్‌లో మంగళవారం నమోదైన డెంగ్యూ కేసుకు సంబంధించి, జ్వరబాధుడ్ని ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన క్షేత్ర పర్యటన చేశారు. ఆయన మాట్లాడుతూ వారం పైబడి నీటి నిల్వలుంటే దోమల ఉత్పత్తికి ఆవాసాలు మారతాయన్నారు. జ్వరం వస్తే వెంటనే దగ్గరలో పట్టణ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ వైఎస్ రత్నంపుట్టి , కోట్ని శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వర్కర్లను కొనసాగించాలి

తగరపువలస: ప్రభుత్వ మద్యం దుకాణాలలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారిని కొనసాగించాలని ఏపీ లిక్కర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకర్ డిమాండ్ చేశారు. ఆనందపురం మండలం వెల్లంకిలో మంగళవారం జరిగిన విశాఖ జిల్లా మద్యం దుకాణాల నిరుద్యోగ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ నిరుత్సాహ పడవద్దని ప్రభుత్వానికి సమస్యలు తెలిసేలా పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇది రాష్ట్రంలో 1.75 లక్షల కార్మికుల సమస్య అన్నారు.

తీరంలో 'సుందరకాండ' సందడి



లొకేషన్‌లో నటుడు నారా రోహిత్

కొమ్మాది: భీమిలి – ఆర్‌కే బీచ్ తీర ప్రాంతాల్లో మంగళవారం షూటింగ్ సందడి నెలకొంది. సందీప్ పిక్చర్ ప్యాలస్ బ్యానర్‌పై నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వం వహిస్తున్న సుందరకాండ అనే సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. నటుడు నారా రోహిత్ హీరోగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు చిన్నపొల్ల సంతోష్, గౌతమ్‌రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మేయర్ గొలగాని హరివెంకట కుమారి



13వ వార్డు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. వార్డులో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం పెదగదిలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ పెద్దల అండదండలతో గెలిపించుకున్న కార్పొరేటర్ పార్టీని వీడి వెళ్లిపోవడం మంచి పద్ధతికాదన్నారు. వైఎస్సార్‌సీపీ బి.ఫారంతో గెలిచిన 13వ వార్డు కార్పొరేటర్ ఇటీవల జరిగిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేశారన్నారు. ఆ ఎన్నికల తర్వాత టీడీపీ వార్డు నాయకులు ఆ కార్పొరేటర్‌ను వాళ్ల పార్టీలోకి రానీయడంలేదన్నారు. దీంతో కొద్ది రోజులుగా ఏ పార్టీలో ఆదరణలేని కార్పొరేటర్‌గా మిగిలిపోయాడన్నారు. ఇప్పుడు తిరిగి వచ్చినా వైఎస్సార్‌సీపీ చేర్చుకోబోదని తేల్చిచెప్పారు. కార్పొరేటర్ పార్టీని వీడి వెళ్లినంతమాత్రాన కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి పరిస్థితిలోనూ వార్డులో కార్యకర్తలకు అండగా నిలుస్తామని, వార్డులో ఏ అవసరమున్నా తాను ముందుంటానని ఆమె భరోసా ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, అల్లంపల్లి రాజబాబు, గూడపాలి విక్టర్, వనం వరలక్ష్మి, సత్యాల సాగరికి, కె.శిరీషా, బేగం, కాకర గోవింద్, వంకర బాబూరావు, వానపల్లి ఈశ్వరరావు, వెంకటరెడ్డి, కె.సుబ్బారావు, ఇమంది సత్యనారాయణ, భాస్కరరావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అపోలోలో వ్యాక్సినేషన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



అపోలో ఆస్పత్రిలో అడల్ట్ వ్యాక్సినేషన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభిస్తున్న వైద్యులు

ఆరిలోవ: హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో అడల్ట్ కోసం ప్రత్యేకంగా వ్యాక్సినేషన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సెంటర్‌ను మంగళవారం అపోలో సీవోవో రామచంద్ర సమక్షంలో ఫైజర్ వ్యాక్సిన్ డైరెక్టర్ మెడికల్ అఫైర్ డాక్టర్ సంతోష్ టౌర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనుల కోసం ఈ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. న్యూమోకాకల్ వ్యాధి, ఇన్‌ఫ్లూయంజ, హ్యూమ్ ప్యాపిల్లోమా వైరస్, హెపటైటిస్ ఎ,బి తదితర వ్యాధులు రాకుండా ఇక్కడ వేక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇవి ప్రాణాంతకమైన వ్యాధులని తెలిపారు. వీటి నుంచి రక్షించుకోవడానికి ఈ వ్యాక్సిన్‌లు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి, డయాబెటిస్, క్రానిక్ మార్డ్, క్రానిక్ కిడ్నీ వ్యాధి, కేన్సర్ తదితర వ్యాధులతో బాధపడేవారికి ఆయా వేక్సిన్లు తప్పనిసరని పేర్కొన్నారు.

శరవేగంగా 'అయోధ్య రామాలయం సెట్'



తుదిమెరుగులు దిద్దుకుంటున్న అయోధ్య రామాలయం సెట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ మరో వినూత్న కార్యక్రమానికి వేదికగా నిలవనుంది. ఈ ఏడాది వినాయక చవితి వేడుకల్లో భాగంగా యూత్ ఐకాన్ సంస్థ ఎంవీపీ కాలనీలో అయోధ్య రామాలయం సెట్‌ను నిర్మించి అక్కడ బాల గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించనుంది. గత ఏడాది ఇదే సంస్థ ఆర్కేబీచ్‌లో చాక్లెట్ వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేసి చవితి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీనికి నగర వాసుల నుంచి విశేష ఆదరణ లభించిన నేపథ్యంలో ఈ ఏడాది ఎంవీపీ కాలనీలో అయోధ్యలోని రామమందిరం నమూనాతో ప్రత్యేక సెట్ నిర్మిస్తోంది. అక్కడ బాల గణపతితో పాటు మట్టి వినాయకుడి భారీ ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి పూజలు ప్రారంభం కానున్నట్లు యూత్ ఐకాన్ ప్రతినిధి కనకరాజు వెల్లడించారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి



ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: వాల్తేర్ ఆర్టీసీ డిపో మేనేజర్, యాజమాన్యం తీరును నిరసిస్తూ ఆ డిపో ఉద్యోగులు మంగళవారం నిరసన బాటపట్టారు. యాజమాన్యం తీరుకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాల్తేర్ డిపో నుంచి పెదవాల్తేర్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా వాల్తేర్ డిపో కార్యదర్శి వసంతరావు మాట్లాడుతూ వాల్తేర్ డిపో పరిధిలోని కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగి సెస్పెన్షన్, డిపో యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే శుక్రవారం నుంచి ఉద్యోగులంతా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీక్షకు దిగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీవీవీ మోహన్, జీఆర్ రావు, ఎంవీఆర్ మూర్తి, బి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

'నైతికతే నిజమైన స్వేచ్ఛ' పేరిట అవగాహన సదస్సులు

బీచ్‌రోడ్డు: జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం జాతీయ స్థాయిలో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ'అనే నినాదంతో అవగాహన ఉద్యమం నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు జమీలా, హానిఫా తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సమాజంలో మితిమీరిన స్వేచ్ఛ పేరుతో చోటుచేసుకుంటున్న అనర్థాల వల్ల మహిళలపై చెడు ప్రభావం పడుతోందన్నారు. నిజమైన స్వేచ్ఛ అనేది కేవలం నైతికతతోనే సాధ్యమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు జాతీయ స్థాయి ఉద్యమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సంస్థ దేశంలో 75 ఏళ్లుగా సమాజ సంస్కరణ కోసం కృషి చేస్తోందని గుర్తు చేశారు. నైతిక మార్పు కోసం మంచి ప్రణాళికను రూపొందించినట్లు వివరించారు. దీని ద్వారా విద్యార్థులు, మహిళల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, కౌన్సెలింగ్, వివిధ పోటీలు నిర్వహించి.. విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తామని చెప్పారు.

నాటారు.. నరికారు



ఏయూలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



అక్కయ్యపాలెం ప్రాంతంలో నరికేసిన చెట్లు

వన మహోత్సవం పేరుతో ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తోంది. కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో నగరంలో పలు చోట్ల ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు పచ్చదనాన్ని పెంపొందించాలని ప్రయత్నిస్తుంటే.. మరోవైపు అదే పచ్చదనాన్ని నాశనం చేస్తుండటం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం